
ప్రజాశక్తి
మంగళవారం 21 జనవరి 2025
5
విజయనగరం



బొబ్బిలి డిఎస్‌పిగా భవ్య

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి డిఎస్‌పిగా జి.భవ్యరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డిఎస్‌పి శ్రీనివాసరావుకు నర్సీపట్నం బదిలీ అయింది. భవ్యకు డిఎస్‌పి శ్రీనివాసరావు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. బొబ్బిలి డివిజన్‌లో శాంతిభద్రతలను కాపాడేందుకు, నేరాలు, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి భవ్య చెప్పారు. గంజాయి, మాదకద్రవ్యాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, రైల్వే, టెలికాం రంగాల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. గ్రూపు-1లో డిఎస్‌పిగా ఉద్యోగం సాధించి, బొబ్బిలిలో మొదటిసారిగా బాధ్యతలు స్వీకరించినట్లు వెల్లడించారు.



నూతన డిఎస్‌పి భవ్యకు స్వాగతం పలుకుతున్న పూర్వ డిఎస్‌పి శ్రీనివాసరావు

డయేరియా కలకలం

- బిల్లలవలసలో 16 మందికి అతిసార
- గ్రామంలో వైద్య శిబిరం
- పరిశీలించిన డిఎంహెచ్‌ఒ జీవనరాణి
- ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు



డయేరియా రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని బిల్లలవలస గ్రామంలో అతిసార సోకింది. ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు 16మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. స్పందించిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు చికిత్స చేశారు. బాధితుల్లో పత్తిగుళ్ల దీపిక, (11) నక్కాన పైడమ్మ (75), వెంపటాపు పైడితల్లి (65)కు వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వీరు జిల్లా కేంద్రాస్పత్రిలోను, ఘోషాసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి లెంక సత్యనారాయణ, డాక్టర్ జి.సమీర స్పందించి ఆదివారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 13 మంది వరకు చికిత్స పొందుతూ కోలుకున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో నిల్వ ఉన్న మాంసం, బిరియానీ తినడం వల్ల డయేరియా సోకిందని తెలిపారు. అయితే ఇది వాస్తవం కాదని గ్రామస్తులు చెబుతున్నారు. మరోవైపు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామంలో తాగునీటిని తనిఖీ నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఎఇ సునీల్‌కుమార్ ఆధ్వర్యాన గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

డయేరియా బాధితులు వీరే..

డయేరియా బారిన పడిన వారిలో పత్తిగుళ్ల దీపిక, (11) నక్కాన పైడమ్మ (75), వెంపటాపు పైడితల్లి (65) జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సుంకర అప్పలనాయుడు, రౌతు చరణ్‌తేజ, పత్తిగుళ్ల రాజశేఖర్, ఇప్పర్తి సీతమ్మ, పత్తిగుళ్ల బంగారమ్మ, పత్తిగుళ్ల అప్పారావు, పత్తిగుళ్ల గౌరి, పతివాడ సూర్యకళ, బోర అప్పన్న, రౌతు అప్పయ్యమ్మ, ఎర్ని యామిని, గంట కృష్ణమ్మ, సంకర అప్పయమ్మ ఉన్నారు. వీరిలో పలువురు కోలుకొని ఇళ్లకు వెళ్లిపోగా మరికొందరు చికిత్స పొందుతున్నారు.

విషయం తెలుసుకున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. డయేరియా అదుపులోనే వుందని చెప్పారు. గ్రామ ప్రజల్లో భయాందోళనలు పోగొట్టేందుకు గ్రామంలోనే వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, 24 గంటలూ పనిచేసేలా ఈ శిబిరంలో ఇద్దరు వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించామన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి డయేరియా లక్షణాలు వున్న వారిని వైద్య సిబ్బంది గుర్తిస్తున్నారని చెప్పారు. బాధితులెవరికీ ప్రాణాపాయం లేదని తెలిపారు. జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ గిరిబాల, తహశీల్దార్ రాజశ్వేరరావు, ఇఒపిఆర్‌డి ఎ.రఘుపతిరావు, పంచాయతీ కార్యదర్శి రమాకుమారి గ్రామాన్ని సందర్శించి రోగులను పరామర్శించారు సర్పంచ్ నెట్టి ఏసురత్నం దగ్గరుండి పర్యవేక్షించారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి



కందివలస గెడ్డను పరిశీలిస్తున్న అధ్యయన బృందం

కాలుష్య కాసారంలో అల్లాడపాలెం

నేల, నీరు, పాడిపంటలు కలుషితం : జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్

ప్రజాశక్తి-పూసపాటిరేగ

కాలుష్యం కారణంగా మండలంలోని చాలా గ్రామాల్లో నేల, నీరు, పాడి పంటలు విషతుల్యమయ్యాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యాక్షులు వి.రాజగోపాల్ అన్నారు. జెవివి ఉత్తరాంధ్ర పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా జెవివి బృందం మండలంలోని అల్లాడ పాలెం, కొణతాలపాలెం, చోడవరం గ్రామాల్లో పర్యటించింది. ఆయా గ్రామాల్లో సమీప నదిలో కాలుష్యంతో నిండిన నీటిని నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలుతో కాలుష్యం వల్ల ఏర్పడ్డ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అధ్యయన బృందం ఎదుట గ్రామంలో యువత, గ్రామస్తులు తమ గోడును వినిపించుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌గోపాల్ మాట్లాడుతూ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సరిహద్దులో ఉన్న ఫార్మా కంపెనీలు యధేచ్ఛగా వ్యర్థ జలాలను బయటకు వదిలేస్తున్నాయన్నారు. దీనివల్ల సమీపా గ్రామాలు అనేక రకాలుగా కాలుష్య విష ప్రభావానికి లోనవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీలు వెదజల్లుతున్న వ్యర్థాల వల్ల మండలం అల్లాడపాలెం, కొణతాలపాలెం ప్రజలు విలవిల్లాడిపోతున్నారన్నారు. ఇక్కడ నేల, నీరు పాడి పంటలు విషతుల్యమయ్యాయన్నారు. దాంతో ఆయా గ్రామాల ప్రజల బతుకు దినదిన గండంగా మారిందని తెలిపారు.

విషతుల్యంగా మారిన గెడ్డ

విజయనగరానికి సరిహద్దులో ప్రవహిస్తున్న కందివలస గెడ్డలోకి అక్కడున్న కంపెనీలు వాటి వ్యర్థాలను కుమ్మరిస్తున్న కారణంగా గెడ్డ మొత్తం కలుషితంగా మారిందన్నారు. ఫలితంగా ఆ గెడ్డ పరీవాహక ప్రాంతంలో ఆనుకొని ఉన్న గ్రామాలన్నీ తీవ్రమైన కాలుష్య ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని చెప్పారు. పంటపొలాలు కాలుష్యం భారినపడి దిగుబడి రాకపోవడమే కాకుండా పండిన పంట తిండికి కూడా పనికిరాని పరిస్థితి దాపురించిందన్నారు. అనేక సార్లు తమ గోడును ప్రజలు ప్రభుత్వ పెద్దలకు అధికారులకు వినిపించినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. కంపెనీల యాజమాన్యాలు వ్యర్థాల నివారణకు తగు చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ చూపించడం లేదని ప్రజలు తమ బృందం ముందు ఆవేదన వ్యక్తం చేసినట్టు జనవిజ్ఞాన వేదిక నాయకులు తెలిపారు.

తమ అధ్యయనంలో గుర్తించిన అంశాలను జిల్లా అధికారులకు, సంంధిత ప్రజా ప్రతినిధులకు నివేదిస్తామని నాయకులు తెలిపారు. కంపెనీల యాజమాన్యాలు సామాజిక భాధ్యతలో భాగంగా అవసరమైన నిధులను కేటాయించి వ్యర్థాల నివారణకు బాధ్యత వహించాలని, ఒకవేళ బాధ్యత వహించని పక్షంలో ఆయా యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఈ అధ్యయన యాత్రలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్, జిల్లా ఉపాధ్యక్షులు చీకటి దివాకర్, కె.మురళీబాబు, జిల్లా కోశాధికారి సిహెచ్ సింహాచలం, పట్టణ కార్యదర్శి కె.శశిధర్ సమతా విభాగం నాయకులు జి.నిర్మల , డాక్టర్ చిన్నారి, కల్చరల్ విభాగం నాయకులు వి. మోహనరావు , సువ్వాడ అప్పలనాయుడు, రమణ సత్యారావు జిల్లా పర్యావరణ సబ్ కమిటీ నాయకులు డి. ఈశ్వరరావు, యూత్ కమిటీ సభ్యులు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఎమ్‌పికి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 9న ఎస్‌కెఎం నాయకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు వ్యక్తిగత సెక్రటరీకి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి. రమణ, రైతు సంఘం నాయకులు వెంకటరమణ, ఆదినారాయణ, రమణ వినతిపత్రం ఇచ్చారు. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ రైతు సంఘాల పోరాటం సమయంలో రైతులు పండించే పంటలకు మద్దతు ధర ఇస్తామని, రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికి ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీలో గత 53 రోజులుగా జగ్జిత్ సింగ్ దల్లెవాల్ నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని చర్చలు జరిపి నిరవధిక దీక్షను విరమింపజేసేలా చర్యలు తీసుకుని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం చేస్తామని తెలిపారు.

బాధితుల సమస్యలను పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం 32 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 4, కుటుంబ కలహాలకు సంబంధించినవి 1, మోసాలకు పాల్పడినట్లుగా 7, ఇతర అంశాలకు సంబంధించినవి 20 ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ ఎస్.శంకరరావు, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్ఐ రాజేష్ , సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రతి వినతికీ పరిష్కారం చూపాలి

- కలెక్టర్ బిఆర్.అంబేద్కర్
- గ్రీవెన్స్‌కు 183 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా వినతుల పరిష్కార వేదికలో వచ్చే వినతికి పరిష్కారం చూపాల్సిందేని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వినతుల పరిష్కారం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి వినతిని ఏవిధంగా పరిష్కరించారనే అంశంపై మూడు దశల్లో తనిఖీ వుంటుందన్నారు. ఆ సందర్భంగా వినతిని అర్జీదారు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించలేదని నిర్ధారణ జరిగితే ఆ వినతిని మళ్లీ తెరచి సంతృప్తికర పరిష్కారం చూపించాల్సి వుంటుందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ కీర్తితో కలసి వినతుల స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయాశాఖల జిల్లా అధికారులకు అందజేసి వాటిని పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారంపై 183 వినతులు అందాయి. రెవిన్యూ శాఖకు సంబంధించిన అంశాలపై 109, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 40, డిఆర్‌డిఎకు సంబంధించి 11 వినతులు అందాయి. ఈ సందర్భంగా వినతుల పరిష్కారం కోసం ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా తీసుకున్న చర్యలపై జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులతో సమీక్షించారు. సక్రమంగా పరిష్కారం కానట్లు ఆడిట్‌లో నిర్ధారించిన వినతులపై ఆయా శాఖల జిల్లా అధికారులను జె.సి. వివరణ అడిగారు.

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత సమీక్ష

జిల్లా ఇన్ ఛార్జి మంత్రి, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మంగళవారం జిల్లాకు వస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో పలు శాఖలపై సమీక్షించనున్నట్టు తెలిపారు. రోడ్లు భవనా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గుంతలు లేని రహదారుల కార్యక్రమం ప్రగతి, ఉపాధిహామీ, పంచాయతీరాజ్, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై మంత్రి సమీక్షిస్తారని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

డెంకాడ మండలం గునుపూరుపేటలో నకిలీ పత్రాలు సృష్టించి భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 48- 4లో ఎకరా 73 సెంట్లు జిరాయితీ మెట్ట భూమి పైల అప్పలనాయుడు, పైల ఈశ్వరరావు, పైల కామేశ్వరరావు, పైలశ్రీను, పైల చిన్న ఈశ్వరరావు, బడుకొండ తవిటినాయుడులకు వారసత్వంగా సంక్రమించిందని తెలిపారు. అయితే ఆ భూమిని కొంతమంది రెవెన్యూ అధికారులతో కలిసి నకిలీ పత్రాలు సష్టించి భూ ఆక్రమణకు పాల్పడ్డారని అన్నారు. ఈ అంశంపై స్థానిక మండల రెవెన్యూ అధికారులకు తెలియజేసినా న్యాయం జరగలేదని వారు వాపోయారు. వారసత్వంగా సంక్రమించిన భూమిని హక్కుదారులకు అందజేసి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

మా జీతాలు ఇప్పించండి

కలెక్టర్‌ను కోరిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్ : జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు డిసెంబర్ నెల జీతాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం గ్రీవెన్సులో ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పైడిరాజు, అనసూయ వినతి అందజేశారు. గత ఏడాది డిసెంబర్ నెల జీతాలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంగన్వాడీలకి అందినా, మన జిల్లాలో పీడీ సెలవులో ఉన్నారనే కారణంతో ఇన్చార్జి పీడీకి డిజిటల్ సంతకం లేని సాంకేతిక కారణాలు చూపి జీతాలు వేయలేదని తెలిపారు. పండగ పూట కూడా జిల్లాలో అంగన్వాడీలు అప్పులు చేసి కుటుంబాలతో పండగ జరుపుకునే పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఇన్చార్జి పీడీ తో మాట్లాడి మంగళవారం సాయంత్రం లోపు జిల్లాలో అంగన్వాడీలకు జీతాలు ఇవ్వాలని ఆదేశించారు.

జెఎన్‌టియులో టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు-జివిలో సోమవారం టెక్నాలజి ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంబించారు. ఉప కులపతి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి హాజరై ఈ కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ, ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, మారోగ్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, అక్షయానూ గ్రీన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి సబ్జెక్ట్ మ్యాటర్ నిపుణులు పరిచయ సెమినార్ నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ మణి కుమార్, డైరెక్టర్లు డాక్టర్ రెను శరత్, డాక్టర్ ఏంజెలా పీటర్, కె. వెంకటేశ్వర్లు, జై ప్రతాప్ చెన్నా, రమ్య ఆగస్తి మాట్లాడారు.

ఆరుగురికి టిడిపి శాశ్వత సభ్యత్వం

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా విజయనగరం నియోజకవర్గానికి చెందిన ఆరుగురు నాయకులు సోమవారం ఆన్‌లైన్ ద్వారా లక్ష రూపాయలు చొప్పున చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు వారిని అభినందించారు. శాశ్వత సభ్యత్వం తీసుకున్నవారిలో ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, పూసపాటి రాజేష్ వర్మ, సువ్వారి అనురాధ బేగమ్, గంటా రవి, అవనాపు విజయ్, కోరాడ వెంకట్రావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ఘనంగా గణతంత్ర వేడుకల నిర్వహణ

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్రంలో జనవరి 26వ తేదీన గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా అధికారులను ఆదేశించారు. నగరంలోని పోలీసు పెరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలను నిర్వహించనున్నామని, జిల్లా వివిధ రంగాల్లో గత ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా ఆయా శాఖలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గణతంత్ర వేడుకల నిర్వహణపై కలెక్టర్ సోమవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. సోమవారం సాయంత్రంలోగా ప్రశంసాపత్రాల కోసం ఉద్యోగుల పేర్లను సిఫారసు చేస్తూ లేఖలు అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రెవిన్యూ, మునిసిపల్ తదితర శాఖలు వేడుకల నిర్వహణలో భాగంగా మైదానాన్ని సిద్ధంచేయడం, వేదిక ఏర్పాట్లు, మైదానం వద్ద తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ దాట్ల కీర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రంగా ఆర్‌టిసి కాంప్లెక్స్

- బస్సులు ఎక్కేందుకు ఇక్కట్లు
- తిరుగు ప్రయాణంలో కష్టాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు వెళ్లిన విద్యార్థులు, ఉద్యోగులు, వలస కార్మికులు తిరుగుముఖం పట్టడంతో సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్సు జనసంద్రంగా మారింది. ప్రధానంగా విజయనగరం, విశాఖనగరాల్లో హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులంతా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు పయనమవ్వడంతో ఆర్‌టిసి కాంప్లెక్సు కిటకిటలాడింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు తమ పుస్తకాల బ్యాగులు, లగేజీలతో రావడంతో కాంప్లెక్స్ అంతా కిక్కిరిసిపోయింది. బస్సులను ఎక్కడానికి ఉరుకులు పరుగులతో బస్సులు కాంప్లెక్స్ పాయింట్ వద్దకు వస్తుండగానే పరిగెడుతూ సీట్లు కోసం ఒకరు ఒకరు తోసుకుంటూ కనిపించారు. ఆర్‌టిసి సిబ్బంది డిపిటిఒ, డిపో మేనేజర్, సిఐ తదితరులు కాంప్లెక్స్ లో ఉండి ఎవరు ఏ రూట్ వెళ్లాలో తెలుసుకుని సూచనలు చేశారు. పిల్లలతో వచ్చిన పలు కుటుంబాలను ఆర్టీసీ సిబ్బంది దగ్గరుండి బస్సులో ఎక్కించారు.



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్



విజయనగరంలో బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

ఆర్‌టిసి కాంప్లెక్స్ కిటకిట

బొబ్బిలి : సంక్రాంతికి సొంత గ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం కావడంతో బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్ సోమవారం కిటకిటలాడింది. ప్రయాణికుల రద్దీ పెరిగినప్పటికీ బస్సుల సంఖ్య పెంచక పోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఆర్‌టిసి అధికారులు స్పందించి బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాడి రైతుల అభివృద్ధే లక్ష్యం



భోగాపురం.. పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

ప్రజాశక్తి-లక్కవరపుకోట

పాడి రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మండలంలోని జమ్మాదేవిపేటలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి కొళాయి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ కొట్యాడ ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రొంగలి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : మండలంలోని రావాడ గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాన్ని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి సంపదను పెంపొందించే దృష్టితో ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం శాస్త్రీయ యాజమాన్యంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోసవ్యాధి చికిత్సలు, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అపరభుక్త పైడినాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ఎన్.దామోదర్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఉమా శంకర్ మహాపాత్రో, మండల పశు వైద్యాధికారి వై.కమల, నాయకులు అవనాపు శ్రీనివాసరావు, నారాయణరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : పశు ఆరోగ్య శిబిరాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆ శాఖ ఎడి విష్ణు కోరారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం, కోమటిపల్లి గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణ మందులు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, చూడి తనిఖీలు, ఎద ఇంజక్షన్స్ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పిరిడి, పక్కి వైద్యులు డి.అనిత, ఎల్.సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బొబ్బిలిరూరల్.. వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎడి విష్ణు

జ్యూట్‌మిల్లు తెరిపించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు తెరిపించి, బోనస్ చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం విశాఖపట్నం లేబర్ కమిషనర్ వద్ద జరిగిన జ్యూట్‌మిల్లు చర్చలకు జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు, ఇఫ్టూ నాయకులు ఎం.అప్పలనాయుడు, శ్రామిక సంఘం నాయకులు సిహెచ్ గోవిందరావు హాజరయ్యారు. జ్యూట్‌మిల్లు తెరిపించి, బోనస్ చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. చర్చలకు జ్యూట్ యాజమాన్యం గైర్హాజరు కావడంతో ఈ నెల 30వ తేదికి వాయిదా వేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ జ్యూట్ చర్చలు వాయిదా వేయడం దుర్మార్గమన్నారు. 8 నెలలుగా జ్యూట్ యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసి కార్మికులను ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్టియన్ సోదరులకు బోనస్ చెల్లించిన జ్యూట్ యాజమాన్యం, ఇతర కార్మికులకు ఈ నెల మూడు తేదీల్లో బోనస్ చెల్లిస్తానని చెప్పి ఇంతవరకూ ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కె.అప్పలసూరి, ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-కొత్తవలస

పిహెచ్‌సి అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. కొత్తవలస పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో చైర్మన్ నీలంశెట్టి గోపమ్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిహెచ్‌సి భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. ప్రస్తుతం ఈ తాత్కాలిక భవనంలో రోగులకు అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించేందుకు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణయ్య, పిహెచ్‌సి వైద్యాధికారి సీతల్ వర్మ, డాక్టర్ సీతామహాలక్ష్మి, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వార్డు సభ్యులు అప్పికొండ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కొరపోలు అప్పారావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఎల్లపు సూరిబాబు, టిడిపి నాయకులు కర్రి సూర్య నూకరాజు, పి రత్నాజీ పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

రామభద్రపురం మండలం కొట్టక్కి రెవెన్యూ 537 సర్వే నెంబర్‌లో పేదల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ 2006-07లో 65 మంది పేదలకు ఒక్కొక్కరికి ఎకరా భూమి చొప్పున పంపిణీ చేశారని తెలిపారు. దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని బినామీ పేర్లతో సాలూరు పట్టణానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు టొంపల నాగరాజు, బాలమ్మ కుటుంబాల వారు అనుభవిస్తున్నారని తెలిపారు. పేదలు సాగు చేస్తున్న భూములను కూడా దౌర్జన్యంగా బెదిరిస్తూ, సాగు చేస్తున్న పంటలను సర్వనాశనం చేస్తున్నారని చెప్పారు. వీటికి కారణమైన నాగరాజు, ఆయన భార్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



డిఎస్‌పి శ్రీనివాసరావును సత్కరిస్తున్న కారుణ్య, రోటరీ ప్రతినిధులు

డిఎస్‌పి శ్రీనివాసరావుకు సత్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

బదిలీపై వెళ్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావును కారుణ్య, రోటరీ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. బుద్ధుడి జ్ఞాపికను అందించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఎస్‌పి భవ్యకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తూ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో రోటరీ, కారుణ్య సంస్థల చైర్మన్ జెసి రాజు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ శ్రీహరి, సర్వీస్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, రోటరీ వైస్ ప్రెసిడెంట్ కె.నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా గాయత్రి

ప్రజాశక్తి-భోగాపురం

ఇఒపిఆర్‌డి కె.గాయత్రికి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె సోమవారం ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంపిడిఒ కిశోర్ కుమార్ ఈ నెల 16వ తేదీ నుంచి మార్చి నెలాఖరు వరకు వ్యక్తిగత కారణాలపై సెలవు పెట్టారు. దీంతో ఆమెకు ఈ బాధ్యతను అప్పచెప్పారు.

శ్మశానం ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మండల కేంద్రంలోని బూడివీధి, యాతపేట, సాలిపేటకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని విశ్రాంత ఉపాధ్యాయులు ఇమంది అప్పారావు సోమవారం తహశీల్దార్ టి.గోవింద్‌కు వినతి అందించారు. గ్రామంలో ఉన్న ఇతర వీధులకు శ్మశానవాటికలు ఉన్నాయని చెప్పారు. తమ మూడు వీధులకు శ్మశాన వాటిక లేకపోవడంతో చెరువుగట్టుపై అంత్యక్రియలు చేయాల్సి వస్తోందని విన్నవించారు. వర్షాలు పడితే అంతిమ సంస్కారానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. తహశీల్దార్ స్పందించి స్థల పరిశీలన చేస్తానని హామీనిచ్చారు.

వైభవంగా వేమాలమ్మ జాతర

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ గ్రామంలో వేమాలమ్మ జాతర సోమవారం వైభవంగా జరిగింది. జాతరకు భారీగా జనాలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. సర్పంచ్ గొంప వేమన నాయుడు, గ్రామ పెద్ద సిరికి రమణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులుగా అప్పారావు

ప్రజాశక్తి-లక్కవరపుకోట

బిఎస్‌పి శృంగవరపుకోట నియోజకవర్గ అధ్యక్షులుగా డి.అప్పారావు నియమితులయ్యారు. సోమవారం లక్కవరపుకోటలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కార్యాలయంలో బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి బి.కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని నియమించారు. నియోజకవర్గ కన్వీనర్లుగా బోను అచ్యుత రమణ, కొట్యాడ అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా గాలి చైతన్యకుమార్, ఉపాధ్యక్షులుగా కణితి సంతోష్, కోశాధికారిగా ఉగాది ఈశ్వరరావు ఎంపికయ్యారు. పాత కమిటీలన్నీ రద్దుచేసి, నూతన కమిటీలను నియమించినట్లు పాడేరు మాజీ ఎమ్మెల్యే కె.రాజారావు తెలిపారు. కార్యక్రమంలో పీరుబండి ప్రకాశ్, పెద్దపెంకి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బిఎస్‌పి నియోజకవర్గ నూతన కార్యవర్గంతో మాజీ ఎమ్మెల్యే రాజారావు

లాలూచీ పడితే వేటు తప్పదు

అధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



సచివాలయ తరలింపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-వేపాడ

మండల స్థాయి అధికారులు... వైసిపి నాయకులతో లాలూచీ పడితే వేటు తప్పదని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హెచ్చరించారు. సోమ వారం మండలంలోని బానాది గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సేవలను ఎమ్మెల్యే ప్రారంభించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీ కార్యాలయం ఉండగా మరో ఇరుకు భవనంలో సచివాలయాన్ని ప్రారంభించారని, దాన్ని మార్చాలని ఎంపిటిసి గొంప తులసి.. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. డిప్యూటీ సిఎం ఆదేశాలతో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. వెంటనే పరిశీలించి గతంలో నిర్మించిన భవనంలో సచివాలయ కార్యకలాపాలు నిర్వహించాలని మండల అధికారులను ఆదేశించారు. ఇటీవల మారిక పర్యటనకు వచ్చిన కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు మరోసారి ఎంపిటిసి తులసి సమస్యను వివరించారు. దీంతో కలెక్టర్ మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే సచివాల యాన్ని పంచా యతీ కార్యాల యానికి మార్చాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యా లయానికి సచివాల యాన్ని మార్చడంతో ఆ సేవలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో సేవలను ఎమ్మెల్యే పరిశీలించారు. సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడుతూ తమది రౌడీ ప్రభుత్వం కాదని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే ప్రభుత్వమని తెలిపారు. మిమ్మల్ని ఎవరైనా వేధించి, ఇబ్బందులు పెడితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ వారంలోనే మళ్లీ సచివాలయ పరిధిలో పనితీరు పరిశీలనకు వస్తానని, ఏం తేడా వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, బానాది ఎంపిటిసి గొంప తులసి, టిడిపి మండల ఉపాధ్యక్షులు పోతల రమణ, ఇఒపిఆర్‌డి మహేష్, పంచాయతీ కార్యదర్శి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లోకం మాధవి సమక్షంలో జనసేనలో చేరుతున్న వైస్ ఎంపిపి గాయత్రి, వైసిపి నాయకులు

జనసేనలోకి వైస్ ఎంపిపి

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం వైస్ ఎంపిపి పడాల సత్యవతి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఎంపిడిఒ కె.గాయత్రికి సోమవారం అందజేశారు. అనంతరం ఆమె జనసేన పార్టీలో ఎమ్మెల్యే లోకం మాధవి ఆధ్వర్యంలో చేరారు. ఆమెతోపాటు వైసిపి నాయకులు పడాల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పడాల రాజేశ్వరి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు పడాల సూర్యనారాయణ, భోగాపురం పంచాయతీ ఏడో వార్డు సభ్యులు పడాల త్రివిక్రమరావు, టిడిపి మండల మాజీ ఉపాధ్యక్షులు అడ్డగర్ల వెంకట్రావు, డెంకాడ మండలం పేడాడకు చెందిన వైసిపి నాయకులు మెహంది సురేష్ కుమార్, జగదీశ్వరరావు తదితరులు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పడాల శ్రీనివాసరావు, సత్యవతి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి జరగాలంటే అది ఎమ్మెల్యేతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం మాధవి వీరందరికీ పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు వందనాల రమణ, గుండు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కాష్వీ ఆస్పత్రి ఎమ్‌డి ప్రవీణ్‌కుమార్

కాష్వీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని కాష్వీ ఆస్పత్రిలో అరుదైన టావి (ట్రాన్స్ క్యాథేటర్ ఆయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్) శస్త్రచికిత్స చేసినట్లు ఆస్పత్రి ఎమ్‌డి ఎం.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. క్లిష్టతరమైన ఆపరేషన్లకు కాష్వీ హాస్పిటల్ కేరాఫ్‌గా నిలుస్తోందని చెప్పారు. సోమవారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆసుపత్రి ఎమ్‌డి ఎం.ప్రవీణ్ కుమార్, కార్డియాలజిస్టు బొబ్బిలి రవి కిషోర్, డాక్టర్ బాలకృష్ణ (అనస్థీషియా), డాక్టర్ లెంక శ్రీనివాస్ (జనరల్ మెడిసిన్), కర్రోతు శేఖర్ (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్) మాట్లాడారు. టావి చికిత్స విధానాన్ని వివరించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మొట్ట మొదటిసారిగా ఈ శస్త్ర చికిత్సను కాష్వీ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు వాడి నిర్వహించమన్నారు. ఆయోర్టిక్ వాల్వ్ స్టెనోసిస్‌తో బాధతపడుతున్న జిల్లాక చెందిన 74ఏళ్ల వయసు గల వ్యక్తికి కేవలం గంట సమయంలోనే ఎటువంటి కట్ లేకుండా తొడ రక్త నాళం ద్వారా వైర్ పంపించి గుండె కవాటం మార్పిడి చేసినట్లు తెలిపారు. ఈ శస్త్ర చికిత్స ద్వారా పేషెంట్ రెండు రోజుల్లోనే కోలుకుని డిశ్చార్జి అవ్వొచ్చని తెలిపారు. ఈ ఆపరేషన్ ఖర్చుతో కూడినది అయినప్పటికీ, అతి తక్కువ ఖర్చు తో చేసినట్లు తెలిపారు. విజయనగరం పరిసర ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చు తో అత్యాధునిక వైద్యసేవలు అందిస్తూ వైద్య రంగం లో వస్తున్న ఆధునిక వైద్య విధానాలు, శస్త్ర చికిత్సలు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావటమే లక్ష్యమని తెలిపారు.

'వనితా' సేవలు స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న క్లబ్ పూర్వ గవర్నర్ కర్రోతు సత్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వనితా వాకర్స్ క్లబ్బు ఫోర్టు శాఖ నిర్వహిస్తున్న సేవలు స్వచ్ఛంద సంస్థలకు స్ఫూర్తిదాయకమని వాకర్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ కర్రోతు సత్యం పేర్కొన్నారు. సోమవారం ఇక్కడి గురజాడ స్వగృహంలో వనిత వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్రోతు సత్యం మాట్లాడుతూ వాకర్స్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రాదేవి నేతృత్వంలో వనిత వాకర్స్ క్లబ్ నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రశంసలు అందుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వాకర్స్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్ర దేవి మాట్లాడుతూ ఈ ఏడాది మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాకర్స్ పూర్వపు గవర్నర్ కొత్తలి ఎర్రి నాయుడు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన విజయనగరంలో నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకైక మహిళల వాకర్స్ క్లబ్ వనిత వాకర్స్ క్లబ్ అని ప్రశంసించారు. నెల్లిమర్ల మండల విద్యాశాఖ అధికారి ఈపు విజయకుమార్, జి. హిమబిందు, క్లబ్ సలహాదారు పప్పు విశ్వనాథం, త్యాడ చిరంజీవి రావు, అల్లంకి బసవమూర్తి , సాయి సంతోషిణి తదితరులు పాల్గొన్నారు.

31, 1 తేదీల్లో ఎంఆర్ కళాశాలలో గణిత వర్క్‌షాప్



గణిత వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ సాంబశివరావు, అధ్యాపకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బెంగళూరు సైన్స్ అకాడమీ ఆర్థిక సహకారంతో ఈ నెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో ఎంఆర్ కళాశాలలో రెండు రోజులు పాటు గణిత శాస్త్రంలో గెస్ట్ లెక్చర్ వర్క్ షాపును నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను సోమవారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌లో చెన్నై మ్యాథమెటిక్స్ ఇనిస్టిట్యూట్ చెందిన డైరెక్టర్ ప్రొఫెసర్ రాజీవ్ కరండికర్ రిసోర్స్ పర్సన్స్ కన్వీనర్‌గా, రిసోర్స్ పర్సన్స్ గా ఐఎంఎస్ ప్రొఫెసర్ పాంచాలి, సిఎంఐ ప్రొఫెసర్ బివి రావు, కృష్ణ, హనుమంతు,మనోజ్ లు వ్యవహరిస్తారని తెలిపారు. ప్రస్తుత సామాజిక పరిస్థితులక అనుగుణంగా గణిత శాస్త్రంలో వస్తున్న మార్పులు, శాస్త్ర సాంకేతిక రంగాల గురించి వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ కళాశాల గణిత శాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు,కళాశాల అధ్యాపకులు ఉమాశంకర్, ఝాన్సీ, స్వామి నాయుడు, స్వాతి,రమేష్, శ్రీదేవి,ధర్మారావు, ఊర్మిళ, సాంఖ్యక శాస్త్ర అధ్యాపకులు ఎంవి లక్ష్మి, నరేష్, ఐక్యుఏసి కోఆర్డినేటర్ అచ్చుతరావు, సలహాదారు సూరి నాయుడు పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి దొందూ దొందే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అభివృద్ధికి ఆటంకం కలిగించడంలో వైసిపి, టిడిపి దొందూ దొందేనని 13వ వార్డు సభ్యులు చిప్పాడ శేషగిరి ఆరోపించారు. సోమవారం శృంగవరపుకోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. తొలుత ఉప సర్పంచ్ మోపాడ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ సమావేశాల్లో ఆమోదం పొందిన తీర్మానాలు అమలు కావడం లేదన్నారు. వార్డు సభ్యులకు గౌరవం ఇవ్వకపోవడం వల్ల 2022 నుంచి పంచాయతీ సమావేశాలను అనేకసార్లు బాయ్‌కాట్ చేశామన్నారు. మూడో వార్డు సభ్యులు కాపుగంటి వాసు మాట్లాడుతూ పట్టణంలోని ఫ్లెక్సీల ఏర్పాట్లలో సర్పంచ్ రాజకీయ ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అనంతరం చిప్పాడ శేషగిరి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఏం చేశారో, ప్రస్తుతం అదే ఒరవడి కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం సర్పంచ్ సంతోషి మాట్లాడుతూ గతంలో రాజకీయ పరిణామాల వల్ల అలా జరిగిందని, ఇక నుంచి అందరం కలిసి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని కోరారు. ఇఒ అనురాధ 9 తీర్మానాలు ప్రవేశపెట్టగా, ఐదింటికి సభ్యులు ఆమోదం తెలిపారు.



మామిడిపూత రాలిపోకుండా పిచికారీ చేయిస్తున్న విహెచ్‌ఎలు

పొగమంచుతో మామిడికి ముప్పు

ప్రజాశక్తి - వేపాడ

గత ఐదు రోజులుగా దట్టంగా కురుస్తున్న పొగ మంచు వల్ల ఇప్పుడిప్పుడే పూస్తున్న మామిడి పూత మాడిపోతుంది. ఉదయం 8 గంటల వరకు వర్షాన్ని తలపించేలా కురుస్తున్న పొగ మంచుతో మామిడి పూత మాడిపోయి రాలిపోతుందని రైతులు వాపోతున్నారు. దీని వల్ల ఈ ఏడాది దిగుబడి కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. కేజీ పూడి, జాకేరు, కరకవలస, గుడివాడ, దబ్బిరాజుపేట, వేపాడ, వీలుపరితి, వావిలపాడు, నల్లబెల్లి, గుడిపాల, బల్లంకి, బానాది, కెఆర్‌పేట, కొంపల్లి, ఆతవ గ్రామాలలో 2,230 హెక్టార్లలో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. పువ్వు పింజే దశలో విపరీతమైన పొగ మంచు పడడం వల్ల పూసిన పూత రాలిపోవడం, మాడిపోవడం జరుగుతుందని, గత డిసెంబర్‌లో పడిన వర్షాల వల్ల మామిడి పంటకు నష్టం కలిగిందని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మామిడి తోటలపై మంచు దెబ్బ పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు



తనిఖీ చేస్తున్న ఎస్ఐ దామోదరరావు

చీపురుపల్లిలో చోరీ

బంగారం, వెండి అపహరించిన దుండగులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ దామోదరరావు కథనం ప్రకారం.. మేజర్ పంచాయతీ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ, కొత్త గవిడి వీధులలో ఉన్న మూడు ఇళ్లలో దుండగులు చోరీకి యత్నించారు. లెక్చరర్స్ కాలనీలో నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు పెద్ది మహేష్ ఇంట్లో 1350 గ్రాముల వెండి, 7 గ్రాముల బంగారం చోరీ అయినట్లు ఎస్ఐ తెలిపారు. విజయనగరం నుంచి క్లూస్ టీంని పిలిపించి, పరిశీలన చేయించినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అరిగిపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,600 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.దేవి తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సారా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గజపతినగరం

సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐలు పి.నరేంద్ర కుమార్, కె.కొండలరావు తెలిపారు. సోమవారం మెంటాడ మండలంలో వాణిజ గ్రామంలో దాడులు చేపట్టారు. బాకా పెంటయ్య 2 లీటర్ల సారాతో వారికి పట్టుబడ్డాడు. ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు ఎస్ఐలు తెలిపారు.